క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే కాటసానికి సన్మానం



కాటసాని రామిరెడ్డిని సన్మానిస్తున్న సుధాకర్‌రెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎల్‌వీ సుధాకర్‌రెడ్డి(వెలగటూరు సర్పంచ్‌), ఉపాధ్యక్షుడిగా ఎంపికైన బి. మహేశ్వరరెడ్డి (కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం) గురువారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన నివాసంలో వేర్వేరుగా కలిశారు. దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. తమ ఎంపికకు సహకరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, బీంరెడ్డిప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలకు కుర్చీల విరాళం



కుర్చీలను విరాళంగా అందజేసిన దాతలు

బనగానపల్లె రూరల్‌: పట్టణంలోని ఎంపీపీ కస్బా ప్రభుత్వ పాఠశాలకు ఎక్సైజ్‌ కానిస్టేబుల్‌ లూయిస్‌ దంపతులు నాలుగు ప్లాస్టిక్‌ కుర్చీలను విరాళంగా అందజేసినట్లు హెచ్‌ఎం సుంకన్న గురువారం తెలిపారు. వారికి హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు సత్యప్రకాష్‌, అబ్దుల్‌కలీం, పుష్పలత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

బేతంచెర్ల: సంక్రాంతిని పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవారిశాల ఆవరణలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్‌ అధ్యక్షుడు అనుముల సుధీర్‌ తెలిపారు. బేతంచెర్ల ఆర్యవైశ్య సంఘం, వాసవీ, వనితా క్లబ్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. మొదటి బహుమతిగా డబుల్‌ కాట్‌ మంచం, ద్వితీయ సోఫా సెట్‌, తృతీయ డ్రస్సింగ్‌ టేబుల్‌, కన్సోలేషన్‌ బహుమతులు ముగ్గురికి ప్రెషర్‌ కుక్కర్లు, జూనియర్‌ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

218 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల: గ్రామాల్లో రామ్‌కో సిమెంట్‌ కంపెనీ ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్‌ శశిధర్‌ అన్నారు. గురువారం కనకాద్రిపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇండియన్‌ బ్యూరో ఆఫ్‌ మైన్స్‌ ఆదేశాల మేరకు క్షయవ్యాధి నిర్మూలన కోసం కంపెనీ వైద్యశిబిరాలు నిర్వహిస్తోందన్నారు. 218 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మైన్స్‌ జీఎం అజ్మల్‌ అహ్మద్‌, డీఎం పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్‌ మేనేజర్‌ కరుణాకర్‌

బేతంచెర్ల: అర్హులైన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందజేస్తామని కెనరా బ్యాంక్‌ మేనేజర్‌ కరుణాకర్‌ తెలిపారు. గురువారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె, సిమెంట్‌ నగర్‌ గ్రామాల్లో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కిరణ్‌కుమార్‌, అగ్రికల్చర్‌ అసిస్టెంట్‌ దేవేంద్ర కుమార్‌తో కలిసి కౌలు రైతు రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌ చైర్మన్‌ నాగ వెంకటేశ్వర్లు, హార్టీ కల్చర్‌ అసిస్టెంట్‌ శివ పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌ నాయకులు

డోన్‌ టౌన్‌: రాజ్యాంగ నిర్మాత బీఆర్‌ అంబేడ్కర్‌పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను భర్తరఫ్‌ చేయాలని కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్‌ గార్లపాటి మద్దిలేటి స్వామి, సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, డీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌ డిమాండ్‌ చేశారు. గురువారం మండలంలోని కొత్తకోట గ్రామంలో ఉన్న అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు

- విద్యుత్‌ దీపాలతో మెరిసిపోతున్న వైష్ణవ ఆలయాలు
- ముమ్మర ఏర్పాట్లు చేసిన సిబ్బంది
- ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు



మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి సహస్ర దీపాలంకరణ సేవలో ఆలయ ఈఓ

బనగానపల్లె రూరల్‌: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని డోన్‌, బనగానపల్లె నియోజకవర్గాల్లోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్‌ దీపాలు, పుష్పాలతో ఆలయాలను సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. బనగానపల్లెలోని కొండపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు శీనయ్య, గోపాల్‌, శ్రీరామవెంకటసుబ్రమణ్యం, టీఎస్‌ఆర్‌ రెడ్డి, కూరగాయాల శేఖర్‌ ఉన్నారు.

–కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి, జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, మహా మంగళహారతి, నక్షత్ర హారతి, తీర్థప్రసాద వినియోగం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శన భాగ్యం కల్పించనున్నామని తెలిపారు.

నేడు మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

బేతంచెర్ల: ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి గురువారం గజవాహనంపై భక్తులను కటాక్షించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచణం, లక్ష తులసీదళార్చన, స్నపన తిరుమంజనం, సుదర్శన హోమం, బలిహరణం, మహానివేదన, మంత్ర పుష్ప సమర్పణ, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అలాగే సహస్ర దీపాలంకరణ సేవను కనుల పండువగా నిర్వహించారు. కాగా శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి, అమ్మవార్లను ఉత్తర ద్వారం ద్వారా దర్శించడానికి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఉప కమిషనర్‌, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. స్వామి, అమ్మవార్లకు జరిపే శాంతి కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు వేదికను రంగు, రంగుల షేమియానాలు పూలతో అలంకరించారు.



స్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న అధికారులు



బనగానపల్లె: శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి బీసీ



కోవెలకుంట్ల: ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం



బేతంచెర్ల: కల్యాణ వేదిక



బేతంచెర్ల: మద్దిలేటిస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

బాబా విగ్రహ ప్రతిష్ట బుక్‌లెట్‌ విడుదల



బుక్‌లెట్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

డోన్‌ టౌన్‌: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న ఆలయంలో ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం రాజస్థాన్‌ నుంచి గతంలో తీసుకొచ్చిన బాబా విగ్రహానికి, చిత్ర పటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల బుక్‌లెట్లను మున్సిపల్‌ చైర్మన్‌ సప్తశైల రాజేష్‌తో కలిసి ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు భాష్యం రమణగౌడ్‌, ధర్మారం సుబ్బారెడ్డి, శ్రీను, కందుకూరు పార్థ, మర్రి కృష్ణయ్యపాల్గొన్నారు.

వాహనదారులకు రూ.3.12 లక్షల జరిమానా



వాహనాల తనిఖీ చేస్తున్న డోన్‌ ఎంవీఐ

బేతంచెర్ల: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు తోడ్పాటు అందించాలని డోన్‌ మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ క్రాంతి కుమార్‌ అన్నారు. గురువారం బేతంచెర్లలోని పలు కూడళ్లలో వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు, బీమా లేని వాహనాలతో పాటు అధిక లోడుతో వెళ్తు న్న స్కూల్‌ వ్యాన్‌లు సహా 17 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ. 3,12,010 జరిమానా విధించారు.

పేదల సంక్షేమానికి కృషి



నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

బేతంచెర్ల: సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధికి రెడ్డి సంక్షేమం సంఘం కృషి చేస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌ రెడ్డి, రామ్‌మోహన్‌ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు బుగ్గన ఆనంద్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. అన్ని వర్గాలతో పాటు రెడ్డి సామాజికవర్గ విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు.

కొళాయిలతో ప్రతి ఇంటికీ నీరు



కొళాయి తిప్పి నీటిని పరిశీలిస్తున్న సర్పంచ్‌ జయచంద్ర

డోన్‌ రూరల్‌: మండల పరిధిలోని అనుంపల్లి గ్రామంలో జల్‌జీవన్‌ పథకం కింద ఏర్పాటు చేసిన ఇంటింటికీ కొళాయిని గురువారం సర్పంచ్‌ బంగారు జయచంద్ర చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతోనే పనులను త్వరగా పూర్తి చేశామన్నారు. గతంలో గ్రామంలో తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఇప్పుడు ఇంటి వద్దకే కొళాయిల ద్వారా నీరు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రూ.20 లక్షలతో నీటి ట్యాంక్‌ ఏర్పాటు చేశామని తెలిపారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కోవెలకుంట్ల: పట్టణంలోని పలు రసాయన ఎరువుల దుకాణాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్‌ ఏఓ విశ్వనాథ్‌ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు, అందుకు సంబంధించిన స్టాక్‌ రిజిస్టర్లు పరిశీలించారు. విజిలెన్స్‌ అధికారుల వెంట కోవెలకుంట్ల ఏఓ నిరంజన్‌ ఉన్నారు.

నేడు సీపీఐ మహాధర్నా

డోన్‌ రూరల్‌: స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి మోటారాముడు, సహాయ కార్యదర్శులు వరదరాజులు, హుసేన్‌పీరా, రామ్మోహన్‌ కోరారు. పట్టణంలోని నక్కిరామన్న భవనంలో గురువారం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా దానిపై ప్రకటన చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇందుకు నిరసనగా ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నామని తెలిపారు.

రీ సర్వేతో భూ తగాదాలకు చెక్‌



ఉప్పలపాడు గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ

అవుకు: రీ సర్వేతో భూ తగాదాలు, సమస్యలకు పరిష్కారం లభిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని డోన్‌ ఆర్డీఓ పి.నరసింహులు అన్నారు. అవుకు మండలం ఉప్పలపాడు గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ నుంచి గ్రామంలో రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి గ్రామ రైతులు, భూయజమానులు సహకరించాలని కోరారు. పాస్‌ పుస్తకాలు తీసుకొచ్చి పొలాల వద్ద హద్దులను చూపించాలని సూచించారు. దీని వల్ల రానున్న కాలంలో ఎలాంటి భూ తగాదాలకు అవకాశం ఉండదని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే వీఆర్వోల ద్వారా తహసీల్దార్‌కు వినతులు అందించవచ్చన్నారు. రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని.. సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. డివిజినల్‌ సర్వేయర్‌ చంద్రశేఖర్‌, ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ నారాయణ రెడ్డి, ఆర్‌ఐ వెంగల్‌ రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

20 నుంచి భూముల రీసర్వే

కోవెలకుంట్ల: భూముల రీసర్వేకు ఎంపికైన పైలెట్‌ గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి రీసర్వే పనులు చేపట్టనున్నట్లు డోన్‌ ఆర్డీఓ నరసింహులు తెలిపారు. పైలెట్‌ గ్రామంగా ఎంపికైన కోవెలకుంట్ల మండలం అమడాలలో గురువారం రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో ఉన్న భూములను బ్లాకులుగా విభజించి ఒక్కో బ్లాక్‌కు 20 ఎకరాలు కేటాయిస్తామన్నారు. గ్రామ సచివాలయ సర్వేయర్‌, వీఆర్వో ఆధ్వర్యంలో రోజుకు 20 ఎకరాల భూమి కొలతలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముందస్తుగా నోటీసులిచ్చి రైతులకు తెలియజేసిన తర్వాత రీసర్వే పనులు జరుగుతాయని తెలిపారు. తహసీల్దార్‌ పవన్‌కుమార్‌రెడ్డి, మండల సర్వేయర్‌ వీరన్న, వీఆర్వో మురళీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డా ఆరోగ్యం



బాలింతలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్‌

బనగానపల్లె రూరల్‌: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని.. ఆరోగ్య నియమాలు తప్పనిసరిగా పాటించాలని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్‌ ఆఫీసర్‌ మోనిక అన్నారు. గురువారం పలుకూరు పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత్‌ మాతృత్వ అభియాన్‌ పథకం కింద గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. 48 మందికి మందులు పంపిణీ చేశారు. తాజా ఆకుకూరలు, పండ్లు, తృణ ధాన్యాలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అటెండర్‌ రాముడు మృతి



కంబగిరి రాముడు(ఫైల్‌)

కొలిమిగుండ్ల: మండల పరిషత్‌ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కంబగిరి రాముడు(60) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. వారం క్రితం డ్యూటీలో ఉండగా అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సా...గుతున్న నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు రామ్‌కో సిమెంట్‌ కంపెనీ రూ.7కోట్ల వ్యయంతో జీర్ణోద్ధరణ పనులు చేయిస్తోంది. మూడేళ్ల దాటినా నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. 2000–21లో కరోనా కారణంగా వైశాఖ మాసం మేలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు బ్రేక్‌ పడింది. 2022లో జీర్ణోద్ధరణ పనులకు అంకురార్పణ చేశారు. అప్పటి నుంచి పనులు చేస్తూనే ఉన్నారు. ఏటా కొండపై వైకుంఠ ఏకాదశి వేడుకలు పెద్ద ఎత్తున జరిగేవి. ఆలయంలో పూర్వం నుంచి ఉత్తర ద్వారం ఉండడంతో ఆ రోజు భక్తులు ఆ మార్గంలో వెళ్లి స్వామిని దర్శించుకునేవారు. ప్రస్తుతం ఆ సౌకర్యం లేకపోవడంతో భక్తులు మనోవేదనకు గురవుతున్నారు. ఐదేళ్లుగా స్వామి ఉత్సవాలు ఆగిపోయాయి. నిర్మాణ పనులు వేగంగా చేసుంటే ఈపాటికి ఆలయంలో నిత్య పూజలు, ఉత్సవాలు జరిగేవని భక్తులు అభిప్రాయపడ్డారు. గర్భగుడి ఆధునీకరణ, శిల్పాల ఏర్పాటు, ఆలయం ముందు విశాలంగా ఉండేలా తీర్చిదిద్దారు. ఐదు అంతస్తుల గాలిగోపురాన్ని పూర్తి చేశారు. వాటికి రంగులు వేయాల్సి ఉంది. గుడిలోపల విద్యుత్‌ పనులు పూర్తయ్యాయి. గాలి గోపురం ముందు భాగంలో మెట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇంకా చేయాల్సిన పనులు ఉండడంతో వచ్చే మే నాటికైనా పనులు పూర్తయి స్వామి ఉత్సవాలు జరుగుతాయో లేదోనని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సైన్స్‌ ఎక్స్‌పో బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్లను విడుదల చేస్తున్న నిర్వాహకులు

డోన్‌ టౌన్‌: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యురేకా సైన్స్‌ ఎక్స్‌పో– 2025ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్‌ రాష్ట్ర ఆడిట్‌ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, పాతపేట హెచ్‌ఎం పద్మావతి కోరారు. గురువారం సైన్స్‌ ఎక్స్‌పో బ్రోచర్లను విడుదల చేశారు. సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, పర్యావరణం–సుస్థిర అభివృద్ధి, మూఢనమ్మకాలు–శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై 5 నిమిషాల వీడియో తీసి ఈ నెల 26వ తేదీ లోపల పంపాలన్నారు. 8,9,10వ తరగతి విద్యార్థులు ప్రవేశ రుసుం రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9441320667, 9703943444, 8919141817 నంబర్లను సంప్రదించాలన్నారు.

వీఎం కమిటీ సభ్యుడి ఎన్నిక



ఉత్తర్వు కాపీని అందుకుంటున్న బాలనాగన్న

కోవెలకుంట్ల: ఎస్సీ, ఎస్టీ సెల్‌ జిల్లా విజిలెన్స్‌ మానిటరింగ్‌ కమిటీ సభ్యుడిగా కోవెలకుంట్ల మండలం భీమునిపాడుకు చెందిన బోధనం బాలనాగన్న ఎన్నికయ్యారు. ఈ మేరకు కలెక్టర్‌ రాజకుమారి జారీ చేసిన ఉత్తర్వు కాపీని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సూపరింటెండెంట్‌ జమున కుమారి గురువారం బాలనాగన్నకు అందజేశారు.



జోలదరాశి సమీపంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

జోరుగా వరినాట్లు



కోవెలకుంట్లలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

స్థానిక వ్యవసాయ సబ్‌ డివిజన్‌లో ఖరీఫ్‌ సీజన్‌ వరి కోతలు పూర్తి కావడంతో రబీ వరిసాగు ఊపందుకుంది. కోవెలకుంట్ల మండలంలో 923 హెక్టార్లు, అవుకులో 900 హెక్టార్లు, ఉయ్యాలవాడ 632, సంజామల 296, దొర్నిపాడు 158, కొలిమిగుండ్ల మండలంలో 80 హెక్టార్లలో కర్నూలు, నంద్యాల సోనా, 555 రకాలకు చెందిన వరి సాగు లక్ష్యం. కుందూనది, కుందర, పాలేరువాగులు, బోర్లు, చెరువులు, తదితర నీటి వనరుల ఆధారంగా వరి నాట్ల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. సబ్‌ డివిజన్‌లో ఇప్పటి వరకు 200 హెక్టార్లలో రైతులు వరినాట్లు వేశారు. ఈ నెలాఖరు వరకు వరినాట్లు వేసేందుకు సమయం ఉండడంతో రైతులు పనుల్లో బిజీ అయ్యారు.

– కోవెలకుంట్ల

ఎస్సీ జాబితా నుంచి పేర్లు తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న జైభీమ్‌ యూత్‌ నాయకులు

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం సచివాలయంలో ఉంచిన ఎస్సీ జాబితాలో ఇతరుల పేర్లు తొలగించాలని జైభీమ్‌ యూత్‌ అధ్యక్షుడు అరవింద్‌ కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్‌ కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ జాబితాలో ఇతర కులాల వారి పేర్లు ఉన్నాయని..వాటిని తొలగించాలన్నారు.

డైరీల ఆవిష్కరణ

డోన్‌ టౌన్‌: ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర విత్తనాభివృద్ధి ఉద్యోగుల కోఆపరేటివ్‌ సొసైటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర డైరీలను ఆ సంస్థ చైర్మన్‌ ధర్మారం మన్నే సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. అనంతపురం జిల్లా సీడ్స్‌ మేనేజర్‌ సుబ్బయ్య, గౌతంకుమార్‌ రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



ప్రియదర్శిని పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



ముగ్గులు వేస్తున్న శివసాయి పాఠశాల విద్యార్థులు

ప్యాపిలి: పట్టణంలోని ప్రియదర్శిని, శివసాయి పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగుదనం ఉట్టి పడేలా ముస్తాబయ్యారు. పాఠశాల ప్రాంగణాల్లో రంగుల రంగుల ముగ్గులు వేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పార్థసారథి, శ్రీదేవి విద్యార్థులకు సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. విభిన్న మతాల పండుగలు, వాటి విశిష్టతను తెలియజేసేందుకు పాఠశాలలో అన్ని పండుగలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు

డోన్‌ టౌన్‌: పట్టణంలోని నెహ్రూనగర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ ప్రభాకర్‌ బహుమతులు(పుస్తకాలు) అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కూడా రంగోలిలా అందంగా ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం తోగట సురేష్‌బాబు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర గౌడ్‌, శారదాదేవి, శివశంకరయ్య, డాక్టర్‌ రాంప్రసాద్‌, రామకృష్ణారెడ్డి, మౌలాలి, లక్ష్మీనాయక్‌ పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ